క్లుప్తంగా

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం గురుదక్షిణామూర్తికి ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పలురకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించి తరించారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వర రావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

కండలేరులో 6.774 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 6.774 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్ల స్టాల్ మూత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల అనాలోచిన నిర్ణయంతో వారానికే స్టాల్ మూయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయ పరిపాలన భవనం గేట్ పక్కనే ఆలయానికి సంబంధించిన క్యాలెండర్లు, ఫొటోలు విక్రయానికి వీలుగా స్టాల్‌ను గత గురువారం ఏర్పాటు చేశారు. ఫొటోలు, క్యాలెండర్లు మాత్రమే ఉండడంతో భక్తులు కొనుగోలుకు ఆసక్తి చూపించలేదు. దీంతో బుధవారం నాటికే స్టాల్‌ను మూసివేశారు. సుపథం మండపంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్టాల్‌లో ప్రసాదాలు కూడా విక్రయిస్తే బాగుంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


ఆలయం వెలుపల ఎంపీ సత్యనారాయణ

తిరుమల: శ్రీవారిని గురువారం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ప్రవచనకర్త దేవిశ్రీ గురూజీ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.


ఆలయం ఎదుట దేవిశ్రీ గురూజీ

సత్యవేడులో మహిళలదే ముందడుగు

- గెలుపుపై మహిళా ఓటర్ల ప్రభావం
- పురుషుల కంటే అధికంగా 3,995 మంది ఓటింగ్
- సంక్షేమ పథకాలపై మహిళలు ఫిదా

సత్యవేడు నియోజకవర్గంలో గతంలో కంటే 2024 సార్వత్రిక ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో మహిళా ఓటింగ్ శాతం పెరగడం విశేషం. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,15,380 మంది కాగా, అందులో 1,83,683 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 89,844 మంది పురుషులుండగా, 93,839 మహిళలు ఉన్నారు. ఈ లెక్కన పురుషుల కంటే 3,995 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు. మొత్తం పోలైన ఓట్లలో సగానికి పైగా మహిళా ఓటర్లు కావడం విశేషం. ఫలితాల నిర్ణయంలో మహిళా ఓట్లే కీలకంగా మారాయి.

మహిళలకు అండగా

వరదయ్యపాళెం: ఈ సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో మహిళా ఓట్ల నమోదు శాతం పెరగడంతో గెలుపుపై వైఎస్సార్ సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు మహిళలను బాగా ఆకర్షించాయి. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వారంతా విశ్వసించారు. మహిళల ఓటింగ్ బాగా పెరగడానికి ఇదే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఇదే వాస్తవ రూపం దాల్చితే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సంచలన విజయం నమోదు చేసుకోనుంది. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు చంద్రబాబు అమలు చేయడనే అప నమ్మకం మహిళల్లో కలిగిందని ప్రచారం కూడా జరుగుతోంది.

పార్టీ శ్రేణుల మధ్య చర్చ

మునుపెన్నడూ లేనివిధంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఎవరికి ప్రయోజనం కలిగిస్తోందన్న కోణంలో ప్రధాన పార్టీ శ్రేణుల మధ్య చర్చ జరుగుతోంది. 15 మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ. అయితే వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన ఆదిమూలంకు టికెట్ కేటాయించడంతో ఆపార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. ఆపార్టీ రెబెల్ అభ్యర్థులు కూడా పోటీలో నిలబడ్డారు. ఈనేపథ్యంలో మహిళలు ఓట్లు వైఎస్సార్ సీపీకే నమోదు అయి ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సంక్షేమ పథకాలే..

గతంలో ఎన్నడూ లేని విధంగా నవరత్నాలతో పాటు సుమారు 21 రకాల సంక్షేమ పథకాలు ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసింది. ప్రతి పథకానికి సంబంధించి లబ్ధి డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా నేరుగా మహిళలకు చేరేలా చర్యలు చేపట్టింది. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి పథకాలతో పాటు నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకువచ్చింది. సొంతిల్లు లేని కుటుంబం ఉండకూడదన్న లక్ష్యంతో అర్హులైన ప్రతి మహిళా పేరిట సెంటు భూమితో పాటు పక్కా ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇచ్చింది. ఆ దశగా సత్యవేడు నియోజకవర్గంలో 17వేల మందికి ఇళ్లు మంజూరు అయ్యాయి. 30వేల మందికి అమ్మఒడి, 35 వేల మందికి ఆసరా, మరో 20వేల మందికి వైఎస్సార్ చేయూత ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అందించింది. దీంతో ఈ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న పాలన రావాలని మహిళలు ఓటుకు పోటెత్తినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


వరదయ్యపాళెంలో ఓటు వేసేందుకు క్యూకట్టిన ఓటర్లు(ఫైల్)

నిలువెత్తు పచ్చని ఫౌంటేన్


కనువిందు చేస్తున్న తాటిచెట్టు

చిల్లకూరు: తమ్మినపట్నం గ్రామానికి వెళ్లే వారు రోడ్డు పక్కనే ఉన్న నిలువెత్తు తాటి చెట్టును కొద్ది సేపు ఆగి చూసి మరి వెళుతున్నారు. ఎందుకంటే తాటి చెట్టుకు పిచ్చ తీగలు పూర్తిగా అల్లుకుపోయి నిలువెత్తు పచ్చని ఫౌంటేన్‌లా కనిపిస్తూ అందరిని ఆకట్టుకుంటోంది. కొన్ని నెలలు పాటు తీగలు అల్లుకుంటేగానీ, ఇలా చెట్టు మొత్తం కనిపించకుండా అల్లుకోలేవు. చెట్టు పచ్చగా కనివిందు చేస్తుంటే అలాగే వదలి వేసినట్లు పొలం యజమాని తెలిపాడు. ఏది ఏమైనా అటు వైపు వెళ్లే వారికి ఈ పచ్చని ఫౌంటేన్ కనువిందు చేస్తోంది.

దయచేసి.. ఈ సమాచారం నమ్మొద్దు





రెవెన్యూ కార్యాలయం వద్ద బోర్డులో తప్పులుగా పేర్లు, ఎంపీడీఓ కార్యాలయ బోర్డులో ..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లోని సమాచార హక్కుచట్టం బోర్డులోని పేర్లు తప్పుల తడకగా ఉన్నాయి. పౌరసమాచార అధికారి, పర్యవేక్షకులు, మొదటి అప్పిలేట్ అధికారి పేర్లు తప్పులుగా ఉన్నాయి. పేర్లు సక్రమంగా లేకపోవడంతో మండల ప్రజలు తికమకపడుతున్నారు. సమాచార కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక అవస్థలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పేర్లు తప్పుల తడకగా ఉన్నాయని, ఇప్పటికైనా స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డుల్లో పేర్లు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి పనులు విరివిగా కల్పించాలి


మర్రిమందలో పనులు చేస్తున్న కూలీలు

ఏర్పేడు: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు విరివిగా పనులు కల్పించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. గురువారం మండలంలోని మర్రిమంద, వికృతమాల ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో రోజుకు రూ.300 వేతనం వచ్చేలా కొలతలు ఇచ్చి దగ్గరుండి పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ప్రతిపంచాయతీలో రోజూ వందమంది కూలీలు తగ్గకుండా చూడాలని వివరించారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమచికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. ఏపీవో దేవరి, క్షేత్ర సహాయకులు సాయమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం


విద్యార్థులతో పరిశ్రమ బృందం

శ్రీకాళహస్తి: మండలంలోని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత విభాగం ఆధ్వర్యంలో ఉభర్తే సితారే కార్యక్రమం ప్రారంభించింది. అందులో భాగంగా పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సాయం, వనరులు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. విద్యారంగానే కాకుండా సంగీతం, గానం వంటి రంగాల్లో ప్రతిభ కనబరచినవారికి సాయం చేసేలా ప్రణాళికను రూపొందించారు. ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం విద్యాసంస్థలతో సన్నిహితంగా పనిచేయాలని నిర్ణయించింది. ఎంపికైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉన్నత చదువులకు అవసరమైన నిధులు ఇవ్వనున్నారు. అందులో భాగంగా గురువారం పరిశ్రమ ఆధ్వర్యంలో పలువురికి సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎస్ఎన్ గోస్వామి,

19న శ్రీకాళహస్తి మహత్యం గ్రంథావిష్కరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర క్షేత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద శ్రీకాళహస్తి మహత్యం గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు సమితి గౌరవాధ్యక్షుడు సింగరాజు ప్రకాశం శాస్త్రి, అధ్యక్షుడు అట్ల పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కై కాలవారిసత్రంలో ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు అష్టదిగ్గజ కవుల్లో ఒకరైన ధూర్జటి కవి ముని మనమడు లింగరాజు కవి విరచిత తాళపత్ర లిఖిత పెద్ద కాళహస్తి మహత్యం గ్రంథ ఆవిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. భాషాభిమానులు, కవులు, రచయితలు, ప్రజలు పెద్దసంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


నారాయణవనంలో వైద్య సిబ్బంది ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ: డెంగీ, మలేరియా, చికున్ గున్యా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. గురువారం బుచ్చినాయుడుకండ్రిగలో డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించి, గాజులపెళ్లూరులో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా జ్వరాలు అనాఫిలస్ అనే దోమ నుంచి వ్యాపిస్తుందని తెలిపారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, రక్తహీనత వంటివి లక్షణాలని పేర్కొన్నారు. ఈ జ్వరాలు సోకకుండా ఉండాలంటే దోమలు రాకుండా తెరలు, ఇంటి ద్వారాలకు కిటికీలకు, మెష్‌లు బిగించాలని, ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వైద్యాధికారి మాధవి, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటుంచాలి

నారాయణవనం: ప్రతి శుక్రవారం డ్రై డేను పాటిస్తే దోమల వృద్ధిని అరికట్టవచ్చని మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో వైద్య సిబ్బంది ర్యాలీలను నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ నీటి నిల్వలతో దోమలు వృద్ధిచెంది జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమ కాటుతో వచ్చే జ్వరాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన వైద్య చికిత్స తదిత అంశాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి రాగసుధ, సిబ్బంది. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

భక్తుల కొంగుబంగారం కరిమాణిక్యస్వామి

- 20 తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు
- టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని తుమ్మూరు గ్రామంలో వందల సంవత్సరాల నాటి ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి వారి ఆలయం భక్తుల కొంగుబంగారంగా వీరాజిల్లుతోంది. ఎన్నో ఏళ్లుగా ఈ ఆలయ బ్రహ్మోత్సవాలను క్రమం తప్పకుండా దేవదాయ శాఖ అధికారులు ఘనంగా నిర్వహిస్తువచ్చారు. 2017 మార్చి 15న కరిమాణిక్యస్వామి ఆలయంతో పాటు పక్కనే ఉన్న గంగా కామాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయాలను టీటీడీలో విలీనం చేశారు. అప్పటి నుంచి తుమ్మూరులో స్వామివార్ల బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు నిర్వహించే స్వామివార్ల కల్యాణోత్సవం, 8వ రోజున జరిగే రథోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు.

ఆలయ పురాణం..

తుంబురుడు, నారదుడు కలిసి కంచి వరదరాజ స్వామిని దర్శించుకునేందుకు వెళ్తూ స్వర్ణముఖి నదికి ఉత్తరవాహినిగల తుమ్మూరు క్షేత్ర ప్రసిద్ధిని తిలకించి దేవాలయంలో ఉన్న అశ్వర్థ వృక్షం కింద తపస్సు ప్రారంభించారు. దాంతో శ్రీ వరదరాజస్వామి గరుడ వాహన దారుడై వారిరువురికి దర్శనమివ్వడంతో వారిరువురూ అక్కడ స్వామివారిని ప్రతిష్ఠించినట్లు పురాణం చెబుతోంది. దీంతో తుమ్మూరు, కంచిలో జరిగే గరుడోత్సవాలు ఒకే రోజున జరుగుతున్న ఆచారం నేటికీ కొనసాగుతోంది.

బ్రహ్మోత్సవాల వివరాలు..

టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 20 తేదీ సోమవారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 21న ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహనసేవ, 22న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి హనుంత సేవ, 23న ఉదయం ద్వారదర్శనం, రాత్రి గరుడసేవ, 24న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి హంసవాహనం, 25న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి విమానోత్సవం, 26 ఉదయం తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం మోహినీ అవతారం, సింహ, గజ వాహన సేవలు. రాత్రి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 27న ఉదయం రథోత్సవం, రాత్రి తిరుచ్చి ఉత్సవం, 28 ఉదయం చప్పరోత్సవం, రాత్రి పార్వేట ఉత్సవం, 29 ఉదయం చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రి ధ్వజావరోహణం, 30 ఉదయం స్వామి వార్లకు అభిషేకం, సాయంత్రం పుష్పయాగ పూజలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. టీటీడీ కార్యనిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి సారథ్యంలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దేవుని కృపకు పాత్రులు కావాలని టీటీడీ అధికారులు హరిరెడ్డి, సుధీర్ కోరారు. తుమ్మూరు ఎస్‌కేబీబీఎస్ సత్రంలో బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ స్థానిక దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమారాధన జరుగుతుందని స్థానిక దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి శశాంక్ తెలిపారు.




శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామివార్లు, స్వామివార్ల రథోత్సవం (ఫైల్)

నాయుడుపేటలో కుండపోత



నాయుడుపేటటౌన్: పట్టణంలో ఉదయం నుంచి మేఘాలు దట్టంగా కమ్ముకుని చల్లటి వాతావారణం నెలకొంది. ఉదయం 11 గంటల సమయంలో గంటపాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో పట్టణంలో రహదారులపై వర్షం నీరు నిలిచిపోయి పాదచారులు సైతం ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి మున్సిపల్ సిబ్బందితో పనులు చేసి వర్షం నీరు డ్రైనేజీ కాలువల్లో తరలిపోయేలా చర్యలు తీసుకున్నారు. ఎండ తీవ్రత లేకుండా చల్లటి వాతావారణం నెలకొనడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.















బండ వేషాలతో భక్తుల కేరింత

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా రెండోరోజు గురువారం భక్తులు బండ వేషాలు ధరించి నగరంలో కేరింతలు కొట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు సందడి చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు కుటుంబ సమేతంగా ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేశారు. జాతర రెండవ రోజున తాతయ్యగుంట గంగమ్మ బండవేషధారణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు తోటి వేషం : తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం తోటి వేషాలతో గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. శరీరానికి బొగ్గుపొడి రాసుకుని తెల్లనామం, కనుబొమలపై చుక్క బొట్లు పెట్టుకుంటారు. పిల్లలు మీసాలను కూడా పెట్టుకుంటారు. తలకు రిబ్బన్లు, నడుముకు వేపాకు ధరిస్తారు. పాత పొరకలు, చాట చేతపట్టుకుని ఎదురుపడిన వారిని తిన్నగా మోదుతూ ఊరేగుతారు. బూతు పాటలు పాడతారు. అనంతరం గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారి పాదాల వద్ద వేపాకు, చాట, పొరకలు పడేసి బూతులు తిడుతూ కేరింతలతో సందడి చేస్తూ భక్తి పూర్వంగా మొక్కులు చెల్లించుకుంటారు.





